లగచర్ల రైతులకు న్యాయం చేయాలని ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

శాసనమండలిని రేపటికి వాయిదా వేయడంతో బయటకు వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

అసెంబ్లీలో రైతు రణం

చేతులకు బేడీలు.. బ్లాక్‌డ్రెస్‌తో అసెంబ్లీకి బీఆర్ఎస్ సభ్యులు

నినాదాలతో హోరెత్తిన శాసనమండలి

- రైతుల అరెస్టులపై వాయిదా తీర్మానానికి పట్టు.. స్పీకర్ తిరస్కరణ
- సర్కార్ సమాధానమివ్వక సభకు విరామం
- తిరిగి ప్రారంభమైనా పట్టువీడని బీఆర్ఎస్
- సభ్యుల నిరసనల మధ్యనే బిల్లుల పాస్

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): పరిశ్రమల పేరిట బలవంతంగా గుంజుకోవాలని చూస్తే, తమ భూములను ఇచ్చేది లేదంటున్న రైతుల పక్షాన అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు సర్కార్‌ను నిలదీశారు. మంగళవారం సెషన్ ప్రారంభం కాగానే, ఇదే అంశంపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. 'రాష్ట్రంలో పరిశ్రమల పేరిట సాగు భూముల బలవంతపు సేకరణను వ్యతిరేకిస్తున్న అమాయక రైతుల అక్రమ అరెస్టులు, నిర్బంధం, అరెస్టు చేసిన రైతులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలి' అనే అంశంపై బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాణిక్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విజయుడు, అనిల్‌జాదవ్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల చట్టబద్ధతపై చర్చించాలని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన భూములను సాగుచేసుకుంటున్న రైతులకు రైతుబంధు, పంట రుణాలు, పట్టాలు ఇవ్వాలంటూ సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని సైతం స్పీకర్ తిరస్కరించారు. తాము ప్రతిపాదించిన వాయిదా తీర్మానానికి అవకాశం ఇవ్వకపోయినా కనీసం చర్చకు అనుమతించాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. స్పీకర్ ససేమిరా ఒప్పుకోకపోవడంతో బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. ఈ పరిస్థితుల్లో సభను స్పీకర్ వాయిదా వేశారు.

విరామం అనంతరం అదే సీన్

విరామం అనంతరం సభ ప్రారంభం కాగానే లగచర్ల రైతులకు సంకెళ్లు వేసిన అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చర్చకు పట్టబట్టారు. స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియం వద్దకు వెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. జగదీశ్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కేపీ వివేకానంద పోడియం ఎదుట బైఠాయించారు. బీఆర్ఎస్ ఆందోళనలకు బీజేపీ సభ్యులు కూడా జత కలిశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మొదలైన నిరసన.. 3:50 వరకు కొనసాగింది. మాజీ మంత్రి గంగుల కమలాకర్ పలు బిల్లుల ప్రతులను చింపివేసి తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. ఒకదశలో బీఆర్ఎస్ సభ్యులతో పోటీగా కౌంటర్‌గా కాంగ్రెస్ సభ్యులు పోటీ నిరసనకు దిగడంతో గందరగోళం ఏర్పడింది.

అటు ఆందోళన.. ఇటు బిల్లులకు ఆమోదం

బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ఆందోళన నిర్వహిస్తుండగానే సభ పలు బిల్లులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ బిల్లును మంత్రి కొండా సురేఖ, తెలంగాణ యూనివర్సిటీల సవరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ, జీఎస్టీ సవరణ బిల్లులను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టగా.. వాటిపై ఎటువంటి చర్చ లేకుండానే సభ ఆమోదం తెలిపింది. అనంతరం నూతన పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చకు స్పీకర్ అనుమతించారు. అయితే, రైతులపై జరుగుతున్న అఘాయిత్యాలపై చర్చించాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. సర్కార్ తీరుకు నిరసనగా నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లి, బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నిరసన, నినాదాలతో సభ హోరెత్తింది. దీంతో స్పీకర్ సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

మండలిలోనూ అదే నిరసన

శాసనమండలి సమావేశాన్ని బీఆర్ఎస్ సభ్యులు స్తంభింపజేశారు. లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. మంగళవారం ప్రశ్నోత్తరాలు ముగిసిన తర్వాత శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. నిరసన, నినాదాలతో సమావేశ మందిరం హోరెత్తింది. దీంతో మండలి ప్రాంగణంలో మార్షల్స్‌ను మోహరించారు. పరిస్థితిని గమనించిన చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మండలిని బుధవారానికి వాయిదా వేశారు. అనంతరం మధుసూదనాచారి ఆధ్వర్యంలో చైర్మన్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. తరువాత మీడియా పాయింట్ వద్దకు చేరుకుని లగచర్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, మహమూద్ అలీ, సత్యవతిరాథోడ్, ఎల్ రమణ, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సురభి వాణీదేవి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చేతులకు బేడీలు...బ్లాక్‌డ్రెస్‌తో..

అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ వినూత్న నిరసనతో సర్కార్ తీరును ఎండగడుతున్నది. లగచర్ల బాధితులకు మద్దతుగా మంగళవారం ఉభయసభల్లో మెరుపు నిరసనలకు దిగింది. సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు ఉభయ ప్రాంగణాల్లోని పార్టీ ఎల్పీ కార్యాలయాల్లో నల్లదుస్తులు ధరించారు. లగచర్ల రైతులకు కాంగ్రెస్ సర్కార్ వేసిన బేడీలను గుర్తుచేసేలా బీఆర్ఎస్ సభ్యులు బేడీలతో నినాదాలు చేస్తూ సమావేశ మందిరాలకు వెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా అదే డ్రెస్‌తో నిరసన వ్యక్తంచేశారు.

నిరసనల మధ్యే 3 బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఒకవైపు బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన నిర్వహిస్తుండగానే ఎలాంటి చర్చ లేకుండా సభ మూడు బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ముందుగా స్పీకర్ అనుమతితో మంత్రి కొండా సురేఖ సీఎం తరపున యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అనంతరం పెద్దపల్లి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ బిల్లుకు మద్దతుగా మాట్లాడుతూ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ తర్వాత తెలంగాణ యూనివర్సిటీ సవరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ, జీఎస్టీ సవరణ బిల్లును మరో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. వీటికి కూడా ఎటువంటి చర్చ లేకుండానే ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. విపక్ష సభ్యుల నిరసనలతో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జోక్యం చేసుకున్నారు. బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ సభ్యులు పేర్కొన్న అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, అసరమైతే జనవరి మొదటివారం వరకు సభకు సిద్ధమేనని, అయితే స్పీకర్‌దే నిర్ణయమని మీడియాతో చిట్‌చాట్‌లో చెప్పారు. సభలో సభ్యులు వ్యవహరించాల్సిన తీరుపై రూపొందించుకున్న రూల్ బుక్‌ను విపక్ష సభ్యులు తుంగలో తొక్కారని మంత్రి సీతక్క ఆరోపించారు. నూతన పర్యాటక పాలసీ-2025-2030కి రూపకల్పన చేసినట్టు నూతన పర్యాటక విధానంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ఒకవైపు స్వల్పకాలిక చర్చ జరుగుతుండగా, మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ ఆందోళన కొనసాగుతుండగా, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

సభాసంఘం వేయాలి

మొదటిపేజీ తరువాయి...

గురుకులాలు విద్యార్థుల హాహాకారాలతో మార్మోగుతున్నాయని, వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ఆడిగితే పాలకులు దాటవేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది కాలంలోనే 850 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. అస్వస్థతతోపాటు పాముకాటు, ఎలుకలు కరిసిన ఘటనల్లో ఎందరో విద్యార్థులు మృతి చెందారని తెలిపారు. వరుస సంఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం మారిన ఈ ఏడాదిలోపే గురుకులాలు ఫుడ్ పాయిజన్, విద్యార్థుల మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. గురుకులాల ఘటనలపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెప్తున్నదని డిమాండ్ చేశారు. ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అని పాడేవారని, ఇప్పుడు వద్దు వద్దు బిడ్డో గురుకుల పాఠశాలకు.. అని పాడుకోవాల్సి వస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది గురుకులాల నుంచి పిల్లలు ఇంటి బాటపట్టారని, ఫలితంగా వేలాది సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వాస్తవాలు గ్రహించి తప్పులను సరిచేసుకొని విద్యార్థులకు న్యాయం చేయాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిది భూదాహం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూదాహం రైతులకు శాపంగా మారిందని మధుసూదనచారి విమర్శించారు. లగచర్ల రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు దీనికి నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వం అక్కడి రైతులను తమ సొంత భూముల నుంచి వెల్లగొట్టే కుట్ర చేస్తుందని విమర్శించారు. లగచర్ల రైతాంగానికి పూర్తి న్యాయం జరగాలని, అరెస్ట్ చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ప్రభుత్వం తిరస్కరించడం సరికాదని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు. రెండు రోజులుగా రైతుల పక్షాన మండలిలో నిరసన తెలిపామని చెప్పారు. తమ భూములను లాక్కోవద్దని నినదించిన రైతులను ఈ ప్రభుత్వం జైల్లో పెట్టిందని, గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లడం ఈ సర్కారు దమననీతికి నిదర్శనమని విమర్శించారు.

లోకం పోకడ

ఎలుకల నివారణకు పిల్లల గదుల్లోకి పిల్లుల్ని వదుల్తున్నా!

ఎమ్మెల్యే నాయినిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ఎల్పీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా నాయిని రాజేందర్ వ్యవహరించిన తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు వెయ్యి కోట్లు సంపాదించారని నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సభా సంప్రదాయాల ప్రకారం సభ్యుడు మాట్లాడేటప్పుడు ఇతర సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయొద్దని నిబంధనలు ఉన్నా, స్పీకర్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎవరిపైనా అవహేళనాత్మక లేదా దూషణల ఆరోపణలు చేయకూడదని సభా నియమావళి స్పష్టం చేస్తున్నా రాజేందర్‌రెడ్డి వాటిని అతిక్రమించారని బీఆర్ఎస్ ఎల్పీ తన ఫిర్యాదులో పేర్కొన్నది. సభలో నాయిని రాజేందర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ కోరింది.

వచ్చే ఎన్నికల ముందు పింఛన్లు పెంచుతాం: యెన్నం

కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుఖంగా, స్వేచ్ఛగా ఉన్నారని, ఎన్నికలు ఇంకో ఏడాది ఉందన్నప్పుడు పింఛన్లను పెంచి ఇస్తాం' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రుణమాఫీ, ఉచిత బస్సుతో రైతులు, మహిళల సంతోషంగా ఉన్నారని, ప్రజలకు కావలసిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలని అవి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని పేర్కొన్నారు. ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉన్నదని, వాటిని చేసుకుంటూ పోతామని అందులో పింఛన్లూ ఒకటని తెలిపారు.

హైదరాబాద్ ముస్లింలు బీఆర్ఎస్‌కే ఓటేస్తరు: వీహెచ్

పార్టీ మీటింగ్‌కు కూలీలు వద్దు: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబర్17(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ముస్లింలు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తారు కానీ, ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్‌కే ఓటు వేస్తారని, లేదంటే ఎంఐఎంకు ఓటు వేస్తారని సీనియర్ కాంగ్రెస్ నేత వీ హన్మంతరావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అయినప్పటికీ, ముస్లింలు తమకు ఎందుకు మద్దతు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వీహెచ్ వ్యాఖ్యలపై ఆగ్రహించిన మైనార్టీ నాయకులు అక్కడే ఆందోళనకు దిగారు. సోమవారం సాయంత్రం గాంధీభవన్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. పార్టీ మీటింగ్‌కు కార్యకర్తలు రావాలిగానీ రూ.100, రూ.200 తీసుకొనే కూలీలు రావద్దని సెటైర్ వేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో దమ్మున్న కాంగ్రెస్ లీడర్ ఒక్కరు కూడా లేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావుకు కౌంటర్ ఇవ్వడం వీళ్లకు చేతకాదంటూ చిటపటలాడారు. అటు వీహెచ్, ఇటు దీపాదాస్ మున్షీ వ్యాఖ్యలతో సభలో గందరగోళం ఏర్పడింది.

ప్రజాప్రతినిధుల కోర్టుకు కౌశిక్‌రెడ్డి హాజరు

రూ.15 వేలతో రెండు పూచీకత్తుల సమర్పణ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారన్న ఆరోపణలతో కమలాపురం పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. రూ.15 వేలతో రెండు పూచీకత్తులను కోర్టుకు సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కౌశిక్‌రెడ్డి ఓటర్లను బెదిరించారని, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని నోడల్ ఆఫీసర్ ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదైంది. దీంతో ఐపీసీలోని 41ఏ సెక్షన్ కింద కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీచేసిన పోలీసులు పూర్తిస్థాయి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలాలపై మరోసారి విచారణ చేపట్టనున్న కోర్టు.. తదుపరి విచారణకు హాజరు కావాలని ఫిర్యాదుదారుడితోపాటు సాక్షులకు సమన్లు జారీ చేసింది.

నగరానికి విచ్చేసిన రాష్ట్రపతి

21వరకు శీతాకాల విడిది

హైదరాబాద్ సిటీబ్యూరో/ మేడ్చల్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతకాల విడిది కోసం మంగళవారం హైదరాబాద్ చేరుకున్నారు. హకీంపేట విమానాశ్రయంలో ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. ఈ నెల 21 వరకు ఆమె హైదరాబాద్‌లో ఉంటారు.

ధనిక రాష్ట్రంగా తెలంగాణ

- కేసీఆర్ నాయకత్వంలోనే అవతరణ
- ఆర్టికల్ 3 వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు
- అన్ని విధాలుగా గ్రామాల అభివృద్ధి
- వచ్చిన జాతీయ అవార్డులే నిదర్శనం
- పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో బీఆర్ఎస్ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఎదిగిందని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి తెలిపారు. రాజ్యాంగం అవతరించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యసభలో మంగళవారం ప్రత్యేక చర్చలో సురేశ్‌రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కారణంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని, అక్కడ నుంచి సభ్యుడిగా ఎన్నికై పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం తనకు లభించిందని సురేశ్‌రెడ్డి చెప్పారు. రాజ్యాగం తమకు ప్రేరణనిచ్చిందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మార్గదర్శక సూత్రాల ఆధారంగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చగలిగామని చెప్పారు. దేశంలోనే ఇప్పుడు తెలంగాణవాసి అత్యంత సంపన్నుడని, తలసరి ఆదాయంలో నంబర్‌వన్‌గా నిలిచామని, దేశ జీడీపీలో తెలంగాణ భాగస్వామ్యం 4.08 శాతమని తెలిపారు.

గ్రామ పంచాయతీల బలోపేతం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 ప్రకారం గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పాటైందని, తెలంగాణలో గ్రామాలను బలోపేతం చేశామని సురేశ్‌రెడ్డి చెప్పారు. గ్రామాలను అభివృద్ధి పరిచామని, పచ్చదనం, పారిశుద్ధ్యం వంటి అనేక అంశాల్లో విజయాలు సాధించామని గుర్తుచేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అందించిన జాతీయ అవార్డులే నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటుకు కొన్ని సూచనలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని సూచించారు. దేశాభివృద్ధికి అధికంగా సహకరిస్తున్న రాష్ట్రాలను జనాభాపరంగా కాకుండా వాటి ఫలితాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. చిన్న పార్టీగా ప్రస్తుతం నలుగురు సభ్యులమే ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యం కోసం సభలో తమ బాధ్యతలను, హక్కులను నిర్వర్తిస్తూనే ఉంటామని చెప్పారు.

2034 నుంచి జమిలి ఎన్నికలు!

- బీఆర్ఎస్ అభిప్రాయాన్ని జేపీసీకి చెప్తాం
- వినోద్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): దేశంలో జమిలి ఎన్నికల అమలు 2034 నుంచి అమలులోకి వచ్చే అవకాశమున్నదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా పార్లమెంట్‌కు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు (జమిలి) నిర్వహించాలనే ఉద్దేశంతో పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిందని తెలిపారు. జమిలి ఎన్నికల నిర్వహణ ఎప్పుడన్నది ఈ బిల్లులో కేంద్రం స్పష్టంగా పేర్కొనలేదని అన్నారు. ఆర్టికల్ 82ఏ ప్రకారం 2029 లో కొత్తగా లోక్‌సభ ఏర్పాటైన రోజు నుంచి ఈ రాజ్యాంగ సవరణ బిల్లు అమలులోకి వస్తుందని ఇందులో పేర్కొన్నట్టు వెల్లడించారు. దీనినిబట్టి జమిలి ఎన్నికల అమలు 2034 నుంచి అమలులోకి వస్తుందని ఈ బిల్లు ద్వారా భావించాల్సి ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలపై బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి తెలియజేస్తామని వినోద్‌కుమార్ తెలిపారు.

ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ఫిజిక్స్ ప్రొఫెసర్

కొత్త సంప్రదాయానికి తెరలేపిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : ప్రవేశ పరీక్షలకు కన్వీనర్ల నియామకంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి కొత్త సంప్రదాయానికి తెరలేపింది. బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ఫిజిక్స్ ప్రొఫెసర్‌ను నియమించి ఆశ్చర్యపరిచింది. కాకతీయ వర్సిటీకి చెందిన ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డిని ఎడ్‌సెట్ కన్వీనర్‌గా నియమించింది. ఇలా నియమించడం అరుదుగా చెప్పవచ్చు. ఈ సారి ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న కాకతీయ వర్సిటీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పర్మినెంట్ ఫ్యాకల్టీ లేకపోవడంతో ఉన్నత విద్యామండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌ను ఎడ్‌సెట్ కన్వీనర్‌గా నియమించడాన్ని ఎన్సీటీఈ సభ్యుడు ప్రొఫెసర్ పారిపల్లి శంకర్ తప్పుపట్టారు. ఈ విషయంపై ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి స్పందిస్తూ సరైన ఫ్యాకల్టీ లేకపోవడంతో, అన్ని విషయాలను సమగ్రంగా ఆలోచించే నిర్ణయం తీసుకున్నామని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

మూసీ డీపీఆర్ లేకుండానే నిధులా?

- ప్రపంచబ్యాంకు, కేంద్రప్రభుత్వ సాయం కోరారా? లేదా?
- ఇప్పుడు డీపీఆర్ చేస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్తుంది?
- ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నరు
- మండలిలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తేతెలంగాణ): మూసీ అభివృద్ధి ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేయకుండానే ప్రపంచబ్యాంకును, కేంద్ర ప్రభుత్వాన్ని సాయం ఎలా అడిగారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యులు మధుసూధనాచారి, సుంకరి రాజు, కాంగ్రెస్ సభ్యుడు టీ జీవన్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు అమీర్ అలీ అడిగిన ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ద్వారా డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు ప్రస్తావించారు. ఈ అంశంపై ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వానికి ప్రశ్నలను సంధించారు. మూసీ నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం ఇప్పుడు చెప్తున్నదని, కానీ రూ.4,100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించినట్టు తమకు నిర్ధిష్టమైన సమాచారం ఉన్నదని చెప్పారు. మూసీ ప్రక్షాళన కోసం రూ.14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతోపాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవలే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి ఏ ప్రాతిపదికన అడిగారని నిలదీశారు. ఈ విషయాలు వాస్తవమా కాదా? సభకు తెలపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్రాన్ని, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, రాష్ట్ర ప్రజలను ఎందుకు తప్పదోవ పట్టిస్తున్నారు? ఈ విషయంలో అవసరమైతే ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెడుతామని కవిత హెచ్చరించారు. ఇదిలా ఉండగా, మూసీ అంశంపై ఇప్పటివరకు డీపీఆర్‌లే సిద్ధం కాలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మూసీ ప్రాజెక్టుకు సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడం కోసం ఎంఆర్‌డీసీఎల్‌కు కన్సాల్టియం, మాస్టర్ ప్లాన్‌కు కన్సల్టెంట్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు.

ఇండ్ల ఈఎంఐలు సర్కారు చెల్లిస్తుందా?

అభివృద్ధి పేరిట మూసీ పరీవాహక ప్రాంతంలో కూలగొట్టిన ఇండ్లకు ఉన్న ఈఎంఐలను ప్రభుత్వం చెల్లిస్తుందా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సూటిగా ప్రశ్నించారు. మూసీ నదీ గర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లే ఖాళీ చేసి వెళ్లిపోయారని, 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని ఇప్పటికే వెళ్లిపోయారని ప్రభుత్వం చెప్పున్నదని, కానీ హృదయ విదారకమైన వీడియోలను చూస్తే ఈ విషయం అవాసస్తవమని తెలుస